క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన రమేశ్



రఘునాథపల్లి : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేశ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీ ఆర్‌ను కలిసి మొక్క అందజేశారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ పరిస్థితి, నాయకుల పనితీరు అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ ప్రజావ్యతిరేకతపై అనుచరించాల్సిన విధానాలపై కేసీఆర్ సూచించారు. అధికారంలో లేమని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రానున్న రోజులు మనవేనని కేసీఆర్ చెప్పినట్లుగా పేర్కొన్నారు.

శిబిరాలను విజయవంతం చేయండి

దేవరుప్పుల : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం 1–19 వయస్సు కలిగిన పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేసే శిబిరాలను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి రాజపురి రవితేజ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల నివారిస్తే రక్తహీనత తగ్గి పోషణ, మానసిక, శారీరక, చురుకుదనం వంటి అభివృద్ధి పెరుగుదల అనివార్యమన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో చిహ్నాన్ని రూపొందించాలి

నర్మెట : కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించబోయే రాష్ట్ర నూతన చిహ్నం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తిని ప్రతిబింబించేలా రూపొందించాలని ధర్మసమాజ్ పార్టీ మండల బాధ్యుడు కొలపురి రవి మహారాజ్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం తహసీల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కలాటి యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. చిహ్నంలో అంబేడ్కర్‌తో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం, సర్వాయి పాపన్న, పండుగ సాయన్న, సమ్మక్క సారక్కల చిత్రపటాలతో అణగారిన వర్గాల, పోరాయోధుల స్ఫూర్తిని ప్రతిబింబించేలా రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇరుగు బాబు, గజ్జెల్లి నవీన్, గోల్కొండ ఉమా తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలి

బచ్చన్నపేట : అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంత మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారని రికార్డులను చూస్తున్నారు. ప్రతినెలా ఎంత స్టాక్ వస్తుందని, పిల్లల హాజరు శాతం, గుడ్ల సరఫరా సక్రమంగా జరుగుతుందా, పౌష్టికాహారం అందిస్తున్నారా అని పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని అంగన్‌వాడీ టీచర్లు నెరవేర్చాలన్నారు. పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపై తనయుడి దాడి.. ఆపై ఆత్మహత్యాయత్నం

రఘునాథపల్లి: తల్లిపై దాడి చేసిన కుమారుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తనయుడు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. మండలంలోని అశ్వరావుపల్లి శివారు వీరారెడ్డితండాకు చెందిన నునావత్ సోనికి నలుగురు కుమారులు ఉన్నారు. భర్త చనిపోవడంతో తన పేరిట ఉన్న భూమిని కొడుకులకు సమానంగా పంచి ఇచ్చింది. 18 గుంటల భూమి తల్లి జీవనోపాధి కోసం ఉంచారు. ఇట్టి భూమి ఇరువురు చిన్న కుమారులకు ఇవ్వగా అందుకు చెరో 50 కేజీల బియ్యం తల్లికి ఇచ్చేలా పెద్ద మనుషులు నిర్ణయించారు. ఈసారి మూడో కుమారుడు బియ్యం ఇవ్వగా, చిన్న కుమారుడు నునావత్ రవి ఇవ్వకపోవడంతో బుధవారం బియ్యం ఎప్పుడిస్తావని తల్లి అడిగింది. కోపోద్రిక్తుడైన రవి తల్లిని నెట్టి వేయడంతో కిందపడింది. ఆవేదన చెందిన ఆమె పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి చిన్నకుమారుడిపై ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు రవికి ఫోన్‌చేసి స్టేషన్‌కు రావాలని సూచించారు. వీరారెడ్డితండా నుంచి పోలీస్‌స్టేషన్ ముందుకు వచ్చిన రవి లోనికి వెళ్లకుండానే సర్వీస్ రోడ్డుపై తన వెంట తెచ్చుకున్న గడ్డి మందు తాగాడు. వెంటనే పోలీసులు స్పందించి తమ వాహనంలో జనగామలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్సై నరేష్‌ను వివరణ కోరగా తల్లి ఫిర్యాదు చేయడంతో రవికి ఫోన్ చేసి స్టేషన్‌కు పిలిచామన్నారు. స్టేషన్ ముందు రోడ్డుపైనే పురుగుల మందు తాగడంతో తామే వాహనంలో ఆస్పత్రికి తరలించాం. అతనికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారని ఎస్సై తెలిపారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

జనగామ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, తరిగొప్పుల, నర్మెట, రఘునాథపల్లి, దేవరుప్పుల, కొడకండ్ల, బచ్చన్నపేట మండల కేంద్రాల్లో రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కొన్ని చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



జనగామ : డీసీసీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



పాలకుర్తి : రాహుల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే యశస్విరెడ్డి, ఝాన్సీరెడ్డి



రఘునాథపల్లి : పండ్లు పంపిణీ చేస్తున్న నేతలు



దేవరుప్పుల: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



కొడకండ్ల : కేక్ కట్ చేస్తున్న సురేశ్‌నాయక్



బచ్చన్నపేటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



చిల్పూరు : పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



నర్మెటలో...

వేర్వేరుగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

- ఘన్‌పూర్‌లో చర్చనీయాంశం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్‌లో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి వర్గీయులు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర వర్గీయులు వేర్వేరుగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఘన్‌పూర్‌లో చర్చనీయాంశంగా మారింది. ఉదయం ఇందిర నివాసంలో యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించగా ఇందిర వర్గీయులుగా చెప్పుకునే ఎంపీటీసీ సింగపురం దయాకర్, కాసాని బొందయ్య, ఘన్‌పూర్ పట్టణ అధ్యక్షుడు నీల శ్రీధర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందూరు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. కాగా సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన వేడుకల్లో పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు. మెజార్టీగా కడియం శ్రీహరి వర్గీయులైన నాయకులే ఉన్నారు. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో కడియం శ్రీహరి, ఇందిర వర్గీయులు అందరూ కలిసి పనిచేశామని నేతలు చెబుతున్నప్పటికీ వాస్తవాలు అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. బయటికి కాంగ్రెస్ నాయకులు అంతా కలిసి ఉన్నట్లు కలర్ ఇస్తున్నప్పటికీ లోపల ఇద్దరు నేతల ముఖ్య అనుచరులు అంతర్మథనం చెందుతున్నారు. ఏది ఏమైనా ముమ్మందు సర్పంచ్, ఎంపీటీసీల టికెట్లు, నామినేషన్ల పదవుల కేటాయింపుల సమయం వచ్చే సరికి గ్రూపులు బహిర్గతం కావడం ఖాయమని స్పష్టంగా తెలుస్తుంది.

రక్తదానం



సర్టిఫికెట్ అందజేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ రూరల్: రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరంలో జిల్లా యూత్ అధ్యక్షుడు బనుక శివరాజ్ తదితరులు పాల్గొన్నాడు. ఈ సందర్భంగా శివరాజ్‌కు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సర్టిఫికెట్ అందజేసి అభినందనలు తెలిపారు.

ఒకరికి బదులు మరొకరు

- పాస్ గ్యారెంటీ పేరుతో అడ్డదారులు
- ఓ కళాశాల యజమానిపై విచారణ
- పలు సెక్షన్ల కింద కేసులు నమోదు
- పోలీసులపై ఒత్తిడి తెస్తున్న నేతలు..?

జనగామ: 'కష్టపడి చదవాల్సిన పనిలేదు.. ఇంట్లో కూర్చుని పరీక్ష పాస్ కావొచ్చు. అటెండెన్స్‌కు ఒక రేటు.. ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తే మరో రేటు'.. ఇలాంటి సంఘటనలు గతంలో జరిగినప్పటికీ.. రెండు రోజుల క్రితం జనగామలో మరోసారి వెలుగు చూసింది. జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 18న జరిగిన ఓపెన్ డిగ్రీ బీకాం ఫస్టియర్ పరీక్షల్లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ ఇద్దరు విద్యార్థులు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పరీక్ష రాసిన వారితోపాటు అసలు విద్యార్థులు మొత్తం నలుగురిపై 419, 420, టీఎస్ పబ్లిక్ ఎగ్జామినేషన్ ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టిస్ కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సృజన్ తెలిపారు. ఇదిలా ఉండగా పట్టుబడిన విద్యార్థుల ఇచ్చిన సమాచారం మేరకు ఇందులో సూత్రధారులు, పాత్రధారులను పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

పైసలిస్తే పాస్ గ్యారెంటీ..

డిగ్రీ చదవాలనే కోరిక ఉన్న విద్యార్థుల అమాయకత్వం.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలతో పాటు పదోన్నతులకు డిగ్రీ సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో దీనిని కొందరు ఆసరా చేసుకుని అడ్డదారిలో పాస్ చేయిస్తామంటూ పెద్ద ఎత్తున బడ్బు దండుకుంటున్నారు. కళాశాలల్లో చేరే సమయంలో ఒకరికి బదులుగా మరొకరితో పరీక్ష రాయిస్తామంటూ మూడు రెట్లు ఫీజు చెల్లించేలా అగ్రిమెంట్ చేసుకుంటున్నట్లు సమాచారం. ఇలా వసూలు చేసిన డబ్బు నుంచి మధ్యవర్తులకు కొంత ముట్టచెబుతూ పరీక్ష రాయిస్తున్నారు. ఇందుకు జిల్లా కేంద్రంలో జరిగిన ఘటనే నిదర్శనం. ఓ దూరవిద్య కేంద్రంలో చదువుకుంటున్న యాదాద్రి భువనగిరికి చెందిన ఇద్దరు విద్యార్థులకు బదులుగా మరో ఇద్దరు పరీక్ష రాస్తూ పట్టుబడగా కష్టపడి చదువుకునే పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

విచారణ వేగవంతం

జనగామ డిగ్రీ కళాశాల ఘటనపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. పట్టుబడిన విద్యార్థుల నుంచి సేకరించిన సమాచారం మేరకు భువనగిరిలోని సదరు కళాశాలకు చెందిన ముఖ్య వ్యక్తిని పిలిపించి కూపీ లాగుతుండగా కొత్త విషయాలు వెలుగు చూసినట్లు సమాచారం. అయితే.. ఈ వ్యవహారంలో పోలీసులు విచారణ చేయకుండా పలువురు బడా నేతలు రంగంలోకి దిగి ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తున్నది.

పట్టాలు ఉన్నా భూమి వారి పేర లేదు

సాక్షి ఎఫెక్ట్..

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన 40 మంది నిరుపేదల భూమిని కొందరు అమ్ముకోగా మంగళవారం భూమి ఇప్పించి న్యాయం చేయండి అంటూ 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ సరస్వతి ఆదేశాల మేరకు ఆర్‌ఐ కల్వల శ్రీనివాస్ బుధవారం గ్రామంలోని అక్రమణకు గురైన భూమిని పరిశీలించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాస్తవంగా 1990లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన భూపట్టాలు బాధితుల పేరనే ఉన్నాయి. కరోనా సమయంలో చాలా మంది వలసలు వెళ్లగా చూసి అక్రమంగా పట్టాలు చేసుకున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఎంత మందికి చెందిన భూమిని అక్రమంగా ఫోర్జరీ చేసి పట్టాలు మార్చుకున్నారో పూర్తిస్థాయిలో విచారణ జరిపి తహసీల్దార్ ద్వారా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. ఈ విషయంలో బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తగున్యాయం జరుగుతందని తహసీల్దార్ తెలిపారు.



శ్రీపతిపల్లిలో విచారణ చేస్తున్న ఆర్‌ఐ శ్రీనివాస్

ప్రమాదకరంగా మలుపు



దేవరుప్పుల : జనగామ–పాలకుర్తి రహదారిలో కోలుకొండ వాగుపై ఉన్న వంతెనకు ఇరువైపులా వాహనదారులకు ప్రమాదపు నివారణ సూచికలు లేకపోవడంతో నిత్యం ప్రాణా పాయ స్థితి నెలకొంది. కోలుకొండ నుంచి జనగామ వైపు వెళ్లేందుకు వంతెనకు చేరే క్రమంలో మలుపు ప్రమాదాలకు నెలవుగా వాహన వేగపరిమితిని తగ్గేందుకు కనీస నివారణ చేపట్టలేదు. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకోవడంతో వానహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి



ఇప్పగూడెంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉమారాణి

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఉమారాణి ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో చేపడుతున్న మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్ల సర్వేలో భాగంగా మండలంలోని ఇప్పగూడెంలో పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటింటా సర్వేను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంటి నంబర్ల ఆధారంగా వార్డుల వారీగా ఇంటింటా తిరుగుతూ మిషన్ భగీరథ నల్లాలు ఉన్నాయా, కుటుంబ సభ్యులు ఎందరు ఉన్నారు, సరిపడా నీరు వస్తుందా అనే వివరాలు, ఇంటి యజమాని ఆధార్‌కార్డు నంబర్ తదితర వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని, సర్వేలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఆమె వెంట ఎంపీఓ సుధీర్‌కుమార్, కారోబార్ శ్రీనివాస్ ఉన్నారు.

డీసీపీకి సన్మానం



జనగామ రూరల్: జనగామ డీసీపీ సీతారాం బదిలీపై వెళ్తుండగా బుధవారం ఆయనను సీపీఎం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. డీసీపీని కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జోగు ప్రకాష్, ఇర్రి అహల్య, చందు, బొట్ల శ్రీను, శేఖర్, గోపి, ధర్మ భిక్షం తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: దివ్యాంగులకు ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీల పరిష్కారం కోసం దివ్యాంగులు ఉద్యమించాలని అన్నారు. గురువారం జిల్లా కమిటీ ఉంటుందని అనంతరం భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సోమరాజు, ఉపేందర్, రాజశేఖర్, రవీందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొడకండ్ల : అనారోగ్యంతో మృతి చెందిన నీలిబండ తండ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు గుగులోత్ జగన్ నాయక్ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. జగన్‌నాయక్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సతీష్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన కందుకూరి మల్లయ్య, మూడిక కిష్టయ్య, భూక్య దుర్గయ్యలు ఇటీవల అనారోగ్యాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టీపీసీసీ కార్యదర్శి సింగపురం ఇందిర ఆదేశాలతో బుధవారం పార్టీ మండల నాయకుడు దాత మాలోతు రాజు ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో రమేశ్, నరేశ్, కృష్ణమూర్తి, సిద్ధయ్య, బాలకృష్ణ ఉన్నారు.

తరిగొప్పుల: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన చింతల గాలమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. బాధిత కుటుంబసభ్యులను రెయిన్‌బో యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకం రాజు బుధవారం పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.3000 ఆర్థిక సాయం అందజేశారు. అనూప్, అక్తర్, తరుణ్,రాజు ఉన్నారు.

పాలకుర్తి టౌన్: మండలంలోని కొండపురం గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడు కోనేటి రమేశ్ భార్య పద్మ ఇటీవల మృతి చెందింది. బుధవారం వైద్య సంఘం ఆధ్వర్యంలో రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. పీఎంపీ, ఆర్‌ఎంపీ వైద్యుల మండల కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శి చిట్యాల వేణు నేత, బిర్రు సోమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, చిదిరాల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉన్నతస్థాయికి విద్యార్థి దశ పునాది

లింగాలఘణపురం: జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్యార్థి దశలోనే పునాదులు పడతాయని చీటూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అయిత నర్సింహులు అన్నారు. బుధవారం చీటూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు దాసారం కృష్ణమూర్తి 55 విద్యార్థులకు టై, బెల్టు, బ్యాడ్జీలను బహూకరించారు. విద్యాసామగ్రిని బహూకరించిన కృష్ణమూర్తిని హెచ్‌ఎం అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించొద్దు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రైవేట్ పాఠశాలల్లో ఎలాంటి పుస్తకాలు విక్రయించొద్దని విద్యాశాఖ మండల నోడల్ అధికారి కొమురయ్య అన్నారు. డీఈఓ ఆదేశాల మేరకు మండల నోడల్ అధికారి బుధవారం స్థానిక ప్రైవేట్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఎలాంటి పుస్తకాలు, టైలు, బెల్టులు అమ్మవద్దని, స్కూల్ బోర్డులలో ఐఐటీ ఫౌండేషన్, కాన్సెప్ట్ స్కూల్ తదితర పేర్లను వాడకుండా రిజిస్ట్రేషన్ సమయంలో ఏ పేరుతో నమోదు చేస్తారో అలానే బోర్డులపై రాయాలని సూచించారు.

సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

చిల్పూరు : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాగునీటికి సంబంధించిన శాశ్వత పరిష్కారం కోసం దేవాదుల ప్రాజెక్టు ఈఈ ఆదేశాల మేరకు డీఈ, ఏఈలు పలు గ్రామాలను సందర్శించి పరిశీలించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి హైదరాబాద్‌లో జలసౌధాలో మంగళవారం పాల్గొని నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలను లేవనెత్తారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులు బోడబండతండా సమీపంలోని కొత్తకుంట పైప్‌లైన్ మరమ్మతు పనులతో పాటు ఫత్తేపూర్, లింగంపల్లి గ్రామ సమీపంలోని తండాలు, మల్కాపూర్‌లోని వలాద్రి చెరువులోకి సాగునీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం కోసం పరిశీలించడంతో పాటు ఎస్టిమేషన్‌ను వేశారు.

మాజీ ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి



తరిగొప్పుల : ఆధునిక కాలంలో సమాజంలో పంచాయతీ కార్యదర్శులపై భౌతికదాడులకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ పంచాయతీ కార్యదర్శి సాంబయ్యపై మాజీ ఎంపీపీ బైరగోని యాదగిరి, అతడి భార్య కళావతి చేసిన దాడిని నిరసిస్తూ మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బుధవారం విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

బ్యాంకును తరలించొద్దు

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను అక్కడి నుంచి తరలించవద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బ్యాంకు ఎదుట నిరసన తెలిపి వినతిపత్రాన్ని బ్యాంకు మేనేజర్ శివశంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చుట్టుపక్కల గ్రామాలకు అనుకూలంగా ప్రస్తుతం అనుకూలంగా ఉందని అలాంటి బ్యాంకును కొందరి స్వార్థం కోసం తరలించొద్దన్నారు. బ్యాంకు తరలింపును ఆపకపోతే పై అధికారులకు ఫిర్యాదు చేస్తూ అన్ని ఖాతాలను ఉపసంహరించుకుంటామని హెచ్చరించారు.

జనాభా నియంత్రణ పాటించాలి

దేవరుప్పుల : జనాభా నియంత్రణ పాటించిన కుటుంబాలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయనీ మండల వైద్యాధికారి రాజపురి రవితేజ అన్నారు. బుధవారం జనగామ చంపక్‌హిల్స్ ఆస్పత్రిలో మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 36 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఇద్దరు పిల్లలు కాగానే తమ నైతిక హక్కుగా భావించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు స్వచ్ఛందంగా సంసిద్ధం వ్యక్తం చేసేలా తోడ్పాటు అందించాలన్నారు. ఆపరేషన్లు విజయవంతం చేసినందుకు వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గుడిసెవాసులకు స్థలాలు మంజూరు చేయాలి

బచ్చన్నపేట : మండలంలోని గోపాల్‌నగర్‌లోని 174 సర్వేనంబర్‌లో గుడిసెలను వేసుకున్న వారికి పక్కా ఇంటి స్థలాలు మంజూరు చేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గుడిసెవాసుల సంఘం అధ్యక్షుడు పర్వతం నర్సింహులు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు ప్రజలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్నారని, అందులోనే రాత్రింబవళ్లు ఉంటున్నారన్నారు. పక్కా గృహాలు లేని నిరుపేదలు దాదాపు 500 మంది గుడిసెలు వేసుకున్నారని, వీరికి ఇళ్లు లేవని పక్కా స్థలాలను కేటాయించేవరకు ఈ స్థలాన్ని విడిచిపోబోమని పలువురు అంటున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుంచు విజేందర్, వెంకటేష్, మిన్నాలపురం ఎల్లయ్య, శోభ, నర్సమ్మ, పద్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎం, డీఎంలపై చర్య తీసుకోవాలి

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలో ఆర్టీసీ భూములు ప్రైవేట్ వ్యక్తులకు అందేలా చూస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం డీఎంలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ స్థలాన్ని పరిశీలించి వారు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ స్థలం చుట్టు మంజూరైన ఫెన్సింగ్‌కు నిధులు వచ్చినా పనులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కాపాడాల్సిన వారే ఇలాంటి పనులు చేయడం ఏంటని ఇలాంటి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎండీ జోక్యం చేసుకొని అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు.

బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతా

పాలకుర్తి టౌన్: మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతామని, ఇతర పార్టీలకు మారేది లేదని పాలకుర్తి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి దయాకర్‌రావు నాయకత్వంలో సమావేశం ఏర్పాటు చేసి పార్టీలోనే కొనసాగేందుకు తగిన సూచనలు అందించారని ఆయన తెలిపారు.